క్లుప్తంగా

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



డ్రగ్స్ అనర్థాలను వివరిస్తున్న సెబ్ సీఐ స్వర్ణలత

హిందూపురం: డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణ దిశగా ఎదుగుదామని సెబ్ సీఐ స్వర్ణలత పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, నాగేంద్రకుమార్ అధ్యక్షతన డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకుద్దామన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. జీవితాన్ని బంగారుమయం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, కళాశాల సమన్వయకర్త రాజన్న, పీడీ హేమంత్ కుమార్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

12 మంది బైండోవర్

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు గ్రామంలో భూ వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 12 మందిపై ఎస్‌ఐ రమేష్ బాబు కేసు నమోదు చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ స్వర్ణలత ఎదుట వీరిని హాజరుపరిచారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ తాలూకా కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో బుధవారం కల్చర్ ఆఫీసర్లు, ఫౌండర్స్, సభ్యులు సమావేశమై తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పుల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా లోకేష్, ఉపాధ్యక్షుడిగా జయచంద్రప్ప, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా శివాజీ అలాగే ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ జయసింహ

రొద్దం: ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చంద్రశేఖర్, ఏపీడీ జయసింహ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు భవనంలో ఉపాధి పనులపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడూ.. ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీల సంబంధించిన బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయకపోతే కూలీల వేతనాలు పడవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఏపీఓ జగదీశ్, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



అమరాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, నాగేంద్రకుమార్, వెంకటస్వామి, చిన్నారెడ్డి, వీరశేఖరాచారి, కమల్‌రాజులు ఇటీవల బదిలీ అయ్యారు. బుధవారం హెచ్‌ఎం.రఘు, సీనియర్ ఉపాధ్యాయుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 8 సంవత్సరాలుగా అంకితభావంతో పని చేసి విద్యాభివృద్ధికి కృషి చేశారని పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యంజేరప్ప, లింగన్న, భీమేష్, నరసింహమూర్తి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ సేవలు అమూల్యం



మండల సర్వేయర్ దినేష్‌రెడ్డిని సన్మానిస్తున్న వీఆర్వోలు

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా విధులు నిర్వర్తించి బదలీపై వెళ్తున్న దినేష్‌రెడ్డి సేవలు మరువలేనివని ఇన్‌చార్జ్ తహసీల్దార్ గురుబ్రహ్మ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కొనియాడారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ దినేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ గురుబ్రహ్మ మాట్లాడుతూ.. భూ సమస్యలను రైతులతో మమేకమై పరిష్కరించారన్నారు. ఇబ్బందులు లేకుండా భూములను సర్వే చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయం సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'యోగా'భ్యుదయం

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా సందడి నెలకొంది. సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా యోగాసనాలు వేశారు. యోగా ప్రాణాయమ ఆసనాలు, సాముహిక సూర్యనమస్కారాలు చేశారు. పలు చోట్ల యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీలు చేపట్టారు. సమావేశాలు నిర్వహించి యోగాపై అవగాహన కల్పించారు. యోగా, ధ్యానం ఆరోగ్యవంతులుగా ఉండటానికి దోహదపడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. అంతర్జాయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురంలోని స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగఫర్ హెల్త్ హ్యాపినెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ.. మనస్సు ఆత్మను శరీరాన్ని ఏకం చేసే సాధనమే యోగా అన్నారు. స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థినులు యోగాసనాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ.. యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చునన్నారు. ఆరోగ్యం కోసం యోగా తప్పనిసరి అని పిలుపునిచ్చారు. పరిగి మండలంలోని అన్ని వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలు, కొడిగేనహళ్ళి ఏపీ ఆర్‌ఎస్, సేవా మందిరం ,ధనాపురం, పరిగి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. మడకశిరలోని డిగ్రీ, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల, పతంజలి యోగా శిక్షణ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వివిధ రూపాల్లో యోగాసనాలు చేయించారు. విద్యార్థులు మడకశిర పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆమిదాలగొంది చెరువులో ఉపాధి సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. యోగాసనాలు వేయించారు. పావగడలో జేఎంఎఫ్‌సీ న్యాయమూర్తులు ఎంఎస్ హరిణి, శ్రీకాంత్ రవీంద్ర,కుమారి విస్మిత మూర్తి తదితరులు యోగా సాధన చేశారు. అలాగే పెనుకొండ, అమరాపురం, రొద్దం, గోరంట్ల, లేపాక్షి, సోమందేపల్లిలో యోగా ప్రాముఖ్యతను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్:



రొళ్ల: కేజీబీవీలో యోగాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



పరిగి: ధనాపురంలో..



హిందూపురం: సంతేబిదనూర్ గ్రామంలో..



గుడిబండ: ఉన్నత పాఠశాలలో..



అమరాపురం: యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



రొద్దం: యోగాసనాలు వేస్తున్న దృశ్యం



హిందూపురం టౌన్: ఎస్‌ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో..



పావగడ: యోగాభ్యసన చేస్తున్న న్యాయమూర్తులు



మడకశిరరూరల్: మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో..



డిపోలో సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం: హిందూపురం ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. డిపో ఎదుట బ్యానర్లు పట్టుకుని నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జోనల్ కార్యదర్శి చెన్నరెడ్డి, నాయకులు రంగనాథ్, కిరణ్ కుమార్ మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. అరియర్స్ కోసం ట్రెజరీ అధికారులకు లంచాలు ఇవ్వడం ప్రోత్సహించడం మానుకోవాలన్నారు. గ్యారెజ్‌లో అన్ని పనిముట్లు ఏర్పాటు చేసి మహిళా ఉద్యోగులకు రెస్ట్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాబాఫక్రుద్దీన్, వెంకటేశులు, బాబా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో రైతులకు గాయాలు

పావగడ: తాలూకాలోని గోరసమావు గ్రామానికి చెందిన నలుగురు రైతులు తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పొలం పనుల్లో నిమగ్నమైన సమయంలో ఒక్కసారిగా తేనెటీగల గుంపు దాడి చేసిందని బాధితులు తెలిపారు. గాయపడిన రైతులు హనుమంతరాయప్ప, శారదమ్మ, తిప్పేస్వామి, మంజునాథ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అమరాపురం: మండలంలోని చిట్నడుకు గ్రామ పొలిమేరలో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.50,100 నగదుతో పాటు ఏడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులందరికీ సర్టిఫికెట్లు అందించడమే లక్ష్యం

పరిగి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని బీచిగానిపల్లి, ఊటుకూరు గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జూన్ 1 నుంచి 28 వరకూ గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ, మ్యారేజ్, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాల మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష పథకంపై గ్రామాల్లో అందరికీ అవగాహన కల్పించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరామప్ప, సర్పంచ్ దిలీప్, ఎంఎల్‌ఓ పవన్‌కుమార్, మండల సచివాలయ గృహసారథుల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీలు అమరావతి, వీఆర్వో నరసింహులు, సెక్రెటరీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలెంటీర్లు, గృహసారథులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగళి: అర్హులందరికీ పథకాలు అందించాలని ఈఓఆర్డీ పద్మావతి సూచించారు. 11 సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అశోక్, రాజు, వేణు గోపాల, వీఆర్‌ఓ నాగరాజు, సర్పంచ్ బసవరాజు పాల్గొన్నారు.



రొళ్ల: అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ క్రిష్టప్ప



బీచిగానిపల్లిలో మాట్లాడుతున్న వీఆర్వో నరసింహులు

రొళ్ల: గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ క్రిష్టప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రత్నగిరి సచివాలయ ఆవరణలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు 'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందించాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో సిబ్బందితో పాటు వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నరంగప్ప, పంచాయతీ కార్యదర్శి రచన, వీఆర్వో ప్రకాష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ. 20 వేలు అందించండి

పెనుకొండ: జగనన్న ఇంటి నిర్మాణాలకు సంబంధించి అర్హులైన ప్రతి పేద లబ్ధిదారుడికి రూ. 20 వేల చొప్పున అందించాలనిమండల ప్రత్యేక అధికారి పద్మావతమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం హౌసింగ్, హార్టికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బేస్ మట్టం, టాప్ లెవెల్ ఇతర పనులకు డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులకు రూ. 20 వేలు ముందస్తుగా అందించాలన్నారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా హార్టికల్చర్ కింద ఎస్‌ఆర్‌ఈజీఎస్‌లో వివిధ రకాల మొక్కలు తీసుకుంటున్న రైతులు వర్షం పడిన వెంటనే నాటేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఏపీఓ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ

పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు

పావగడ: తాలూకాలోని 34 గ్రామ పంచాయతీల అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. స్థానిక ఎస్‌ఎస్‌కే బయలు రంగ మందిరంలో జిల్లా కలెక్టర్ కే శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెండో విడత అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాల రిజర్వేషన్ల వివరాలను వెల్లడించారు. సాసలకుంట అధ్యక్ష (కేటగిరీ–ఏ గొల్ల మహిళ), ఉపాధ్యక్ష (ఎస్సీ జనరల్), విరుపసముద్ర అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్సీ మహిళ), నలిగానహళ్ళి అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్టీ మహిళ)కు రిజర్వ్ చేశారు. నాగలమడక అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్టీ మహిళ), తిరుమణి అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ), పళవల్లి అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్టీ జనరల్), జోడి అచ్చంపల్లి అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్సీ మహిళ)కు కేటాయించారు. కొండేతిమ్మనహళ్ళి అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్సీ మహిళ), అరసికెరె అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్సీ మహిళ), వైఎన్ హొసకోట అధ్యక్ష (జనరల్), ఉపాధ్యక్ష (ఎస్సీ మహిళ)కు రిజర్వ్ చేశారు. పావగడ రొప్ప అధ్యక్ష (జనరల్ మహిళ) ఉపాధ్యక్ష (ఎస్సీ), బ్యాడనూరు అధ్యక్ష (జనరల్ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), మరిదాసనహళ్ళి అధ్యక్ష (జనరల్ మహిళ), ఉపాధ్యక్ష (ఎస్టీ మహిళ)కు కేటాయించారు. కోటగుడ్డ అధ్యక్ష (జనరల్ మహిళ) ఉపాధ్యక్ష (ఎస్టీ), బూదిబెట్ట అధ్యక్ష (జనరల్ మహిళ), ఉపాధ్యక్ష (ఎస్సీ), గుజ్జనడు అధ్యక్ష (జనరల్ మహిళ), ఉపాధ్యక్ష (ఎస్సీ), చన్నకేశవపుర అధ్యక్ష (జనరల్ మహిళ), ఉపాధ్యక్ష (ఎస్టీ)కి కేటాయించారు. కొడమడుగు అధ్యక్ష (జనరల్ మహిళ) ఉపాధ్యక్ష (ఎస్సీ), దొమ్మతమరి అధ్యక్ష (ఎస్సీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ), వెంకటాపుర అధ్యక్ష (ఎస్సీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ)కు రిజర్వ్ చేశారు. రాజవంతి అధ్యక్ష (ఎస్సీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ), వదనకల్లు అధ్యక్ష (ఎస్సీ), ఉపాధ్యక్ష కేటగిరీ–ఏ గొల్ల మహిళ), మంగళవాడ అధ్యక్ష (ఎస్సీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ), కన్నమేడి అధ్యక్ష (ఎస్సీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), ర్యాపిట అధ్యక్ష (ఎస్సీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్)కు కేటాయించారు. బీకే హళ్ళి అధ్యక్ష (ఎస్సీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), సిద్ధాపుర అధ్యక్ష (ఎస్సీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), రంగసముద్ర అధ్యక్ష (ఎస్సీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), వళ్ళూరు అధ్యక్ష (ఎస్టీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ)కు రిజర్వ్ చేశారు. కామనదుర్గ అధ్యక్ష (ఎస్టీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ), పొన్నసముద్ర అధ్యక్ష (ఎస్టీ), ఉపాధ్యక్ష (జనరల్ మహిళ)కు కేటాయించారు. చిక్కహళ్ళి అధ్యక్ష (ఎస్టీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), పోతగానహళ్ళి అధ్యక్ష (ఎస్టీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్), న్యాయదగుంటె అధ్యక్ష (ఎస్టీ మహిళ), ఉపాధ్యక్ష (జనరల్) వరుసగా అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వ్ చేశారు.



రిజర్వేషన్లను ప్రకటిస్తున్న జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాస్

సన్మానం

గోరంట్ల: మండల పరిధిలోని డి గంగంపల్లి అంగన్‌వాడీ టీచర్ శాంతమ్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ శాంతమ్మ ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు.

పెనుకొండ: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సబ్‌రిజిస్ట్రార్ నల్లప్పను ఎంఈఎఫ్ నాయకులు సన్మానించారు. ఇటీవల ఆయన సబ్ రిజిస్ట్రార్‌గా భాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, హరీష్, గోవింద్, శివశంకర్, ముత్యాలు, శివణ్ణ, ఓబులేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ అనుమతులు తప్పనిసరి

సోమందేపల్లి: నక్కలగుట్ట కాలనీలో రెవెన్యూ శాఖ అనుమతులు లేకుకండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కాలనీలో పోలీసులు, రెవెన్యూ అధికారులు పర్యటించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురువుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

మద్యం అక్రమ రవాణా, విక్రయాలు నేరం

పరిగి: యువత ప్రధానంగా దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో కర్ణాటక మద్యం అక్రమ రవాణా, క్రయ విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. పేకాట, మట్కా నిర్వహిస్తే జైలుకెళ్లడం ఖాయమన్నారు. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి వీణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-2లు

గుడిబండ: ఎంఈఓ–2గా రవిచంద్ర కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న రవిచంద్ర కుమార్‌ను గుడిబండ ఎంఈఓగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పని చేస్తున్న ఎంఈఓ శ్రీధర్ రొళ్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎంఈఓలను మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న గుడిబండ ఎంఈఓ-2 రవిచంద్ర కుమార్

అమరాపురం ఎంఈఓ–2గా వెంకటరమణ నాయక్

అమరాపురం: మండల విద్యాశాఖాధికారి–2గా వెంకటరమణ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈయన చిలమత్తూరు మండలం కొడికొండ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవలే పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలో నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

లేపాక్షి: చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివానందనాయక్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం జామ, టెంకాయ, చీని, మామిడి మొక్కలను పంపిణీ చేస్తుందన్నారు. ఇతర పండ్ల మొక్కలు నాటుకుంటే ఉపాధి కింద బిల్లులు చెల్లిస్తామన్నారు. గుంతలు తవ్వకునేందుకు కూడా ఉపాధి కింద బిల్లులు అందజేస్తామన్నారు. అంతేకాకుండా పండ్ల తోటల్లో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 3 సంవత్సరాల పాటు పండ్ల తోటలను కాపాడుకుంటే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏపీఓ జ్యోతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ శివానందనాయక్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పెనుకొండ: కేంద్ర కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్‌ను స్థానిక బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. హిందూపురం నుంచి పెనుకొండకు చేరుకున్న మంత్రిని సీనియర్ బీజేపీ నాయకులు పాలూరి కృష్ణమూర్తి, సుంకు సత్యనారాయణ, రామాంజినేయులును పరామర్శించారు. అనంతరం భోగసముద్రం చెరువు వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా మోర్చా అధ్యక్షుడు రామకృష్ణ ఇంట్లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పెనుకొండ రాజరికపు వైభవం, దేవాలయాల నిర్మాణంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్‌స్వామి, సూరి, సుభాష్, హనుమంతు, రవి పాల్గొన్నారు.



కేంద్రమంత్రి దేవుసిన్హ్ చౌహాన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

